# గ్రహణం విడిచిన వేళ

అతి కష్టంమీద కారు నడుపుతున్నాడు డ్రైవర్. రోడ్డు అంతా గతుకులే. గాలికి ఎగిరివచ్చే ధూళి కంట్లో పడటంవల్ల రోడ్డు కనిపించటం కష్టంగా ఉంది.

సాయంత్రం నాలుగు గంటలు కావస్తున్నా ఎండ ఇంకా తగ్గలేదు. తన అధీనంలో ఉన్న శతకోటి కిరణాల జవానులను బాగానే కమేండు చేస్తున్నాడు సూర్యుడు అనిపించింది నాకు. ముప్పై ఐదేళ్ళు ఆర్మీలో పనిచేసి ఆర్మీ చీఫ్‌గా రిటైర్ అయిన నాకు సూర్యుడు కూడా బ్రిగేడియర్‌లాగే కనిపించాడు.

మా ఊరు దగ్గరపడుతున్న కొద్దీ గుండె గబగబా కొట్టుకొంటోంది. పది సంవత్సరాల తర్వాత మా ఊరు వెడుతున్నాను. ఊరు ఎంత మారిపోయి ఉంటుందో. ఏమో?

దూరంనించి స్కూలు కనిపించింది. నేను ఆ స్కూలులోనే చదువుకున్నాను. అప్పటిలాగే రంగు వెలిసిపోయి, పెంకులు ఊడిపోయి శిథిలావస్థలో ఉన్న స్కూలును చూస్తే బాధ కలిగింది. గేటు దగ్గరగా ఉండే మర్రిచెట్లు అలాగే ఉన్నాయి. వాటికిందే నేనూ, రంగా గోలీకాయలు ఆడుకొనేవాళ్ళం. ఇంటినుంచి తెచ్చుకున్న కారియర్లు విప్పి అక్కడే కూర్చుని తినేవాళ్ళం

స్కూలుదాటి కుడిచేతివైపు సందులోకి తిరిగింది కారు. ఇంకో నాలుగు కిలోమీటర్లు వెళితే మా ఊరొస్తుంది.

ఊళ్ళో పాత స్నేహితులు ఎవరైనా ఉన్నారో, లేదో? పదేళ్ళక్రితం వచ్చినప్పుడు రంగారావు ఒక్కడే కనిపించాడు. ఎండాకాలం కనుక ఉద్యోగరీత్యా పై ఊళ్ళలో ఉండే స్నేహితులెవరైనా సెలవుల్లో వచ్చి ఉండవచ్చు.

పదేళ్ళయింది అక్కా బావలని చూచి. ఎలా ఉన్నారో, ఏమో? వాళ్ళకి ఇల్లు అమ్మడానికి వచ్చానన్న సంగతి ఎలా చెప్పాలి?

సడన్‌గా ఓ పెద్ద కుదుపుతో కారు ఆగింది.

డ్రైవరుతో పాటు నేనూ దిగి చూశాను. ఎదురుగా పెద్దగడ్డ. కారు ఇక ముందుకు వెళ్ళదు. కారులో నుంచి పెట్టె తీసుకుని డ్రైవర్‌ని పంపించేశాను.

మేమీ స్కూలులో చదివేరోజుల్లో ఒక చిన్నవాగులా పారుతుండేది ఈ గడ్డ. ఎప్పుడూ మోకాళ్ళ వరకూ ఉండేది నీరు. స్కూలుకి వెళ్ళేప్పుడూ, వచ్చేప్పుడూ నీళ్ళు తుళ్ళించి తోటి పిల్లల్ని ఏడిపించేవాణ్ణి. ఎన్ని పంచవర్ష ప్రణాళికలు గడచిపోయినా మా ఊరికీ, టౌనుకీ మధ్య అడ్డుగా నిలచిన ఈ గడ్డమీద ఓ బ్రిడ్జిపడలేదన్నమాట!

గడ్డ దాటి వేగంగా నడిచేను. రెండువైపులా పొలాలు సామాన్య మానవుని బ్రతుకులాగా ఎండిపోయి, బీటలువేసి ఉన్నాయి. గోచీలు పెట్టుకొని రోడ్డుమీద వెడుతున్న రైతులు నన్ను ఆశ్చర్యంగా చూశారు.

నౌకాదళానికి న్యూక్లియార్ సబ్ మెరైన్‌లు వచ్చాయి; వాయుసేనకి సూపర్ జెట్ ఫైటర్స్; ఆర్మీకి బోఫోర్స్ తుపాకులు వచ్చాయి, కానీ మా ఊరిలాంటి గ్రామాలకి...

ఏనాడో వేసిన మట్టిరోడ్డు గతుకులు గతుకులుగా ఉంది. బస్సు సదుపాయం గానీ, వైద్యసదుపాయం గానీ లేదు. విద్యాసదుపాయం గురించి అయితే ఇక చెప్పనక్కరలేదు. బహుశా మా ఊరి లాంటి కొన్ని గ్రామాలు ప్రణాళికలు తయారుచేసే వాళ్ళ లెక్కల్లో లేవేమో?

అప్పడాలు వత్తుతున్న మా అక్క నన్ను చూసి తుళ్ళిపడింది. "అదేంటిరా సుబ్బారావ్, ఉత్తరం పత్తరం లేకుండా హఠాత్తుగా వచ్చేశావు?" అంది.

"నిన్నూ, బావనీ చూడాలనిపించింది. వచ్చేశాను." నావోటి కొచ్చిన అబద్ధం చెప్పేశాను.

"ఎవరి దగ్గరరా నీ బడాయి?" పెట్టె అందుకుంటూ అంది అక్క "నీకేదో పనిపడి ఉంటుందిలే. లేకపోతే మమ్మల్ని చూడటానికని ఇంతదూరం వస్తావేంటి?" చెంబుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

"పద్మ ఒంట్లో ఎలా ఉంటోందిరా?"

పద్మ నా భార్య.

"బాగానే ఉందక్కా."

"ఎన్నాళ్ళయిందో దాన్ని చూసి, దాన్నీ తీసుకు రావాల్సింది?"

మా అక్క అమాయకత్వానికి నాకు నవ్వు వచ్చింది. పద్మ ఢిల్లీలో పుట్టి పెరిగింది. పల్లెటూళ్ళన్నా, పల్లెటూరి జనాలన్నా ఆమెకు అసహ్యం. ఆ సంగతి అక్కకి బాగా తెలుసు. నాన్నగారు పోయినప్పుడు చాలా బలవంతంమీద ఈ ఊరు తీసుకొచ్చానంతే.

అరుగు మీద ఉన్న పడక కుర్చీలో కూర్చున్నాను. నాకు ఊహ తెలిసిం దగ్గరనుంచి ఆ కుర్చీ అక్కడే ఉంది. మా చిన్నప్పుడు నాన్నగారు ఆ కుర్చీలోనే కూర్చుని ఊళ్ళో వాళ్ళ చిన్న చిన్న తగువులు తీర్చేవారు.

అక్క కాఫీ కాబోలు కలుపుతోంది. లోపలి కెళదామని లేచాను. గుమ్మానికి ఎదురుగా నాన్నగారి పెద్ద ఛాయాచిత్రం కనిపించింది.

దేశమంతటా పేరు ప్రఖ్యాతులు పొందిన స్వాతంత్ర్య యోధుడాయన. దేశ సేవకోసం తన ఆరోగ్యమేకాక, సంపదను కూడా ధారపోసిన నాన్నగారు మాకు మిగిల్చింది ఓ ఎకరం పొలం, ఆ పెంకుటిల్లు.

తన కొడుకు తనకన్నా గొప్ప దేశ సేవకుడు కావాలని కోరాడాయన. నాన్నగారి కోరిక మీదే ఆర్మీలో చేరాను. ఏదో దేశానికీ, మా ఊరికీ మేలు చేయవచ్చని ముప్పై ఐదు సంవత్సరాలు సర్వీసు చేశాను. అతి విశిష్ట సేవా మెడల్స్, పరమవిశిష్ట సేవా మెడల్సు పొందాను. ఆర్మీ చీఫ్‌గా రిటైర్ అయ్యాను. కాని మా ఊరికి ఏం మేలు చేశాను?...

"ఏమిట్రా ఆలోచిస్తున్నావ్?" గ్లాసునిండా కాఫీ తీసుకొచ్చింది అక్క.

"నీ మనవలు బావున్నారురా? చిన్నవాడికి ఇప్పుడు రెండేళ్ళు నిండి ఉంటాయి కాబోలు."

"ఊ..." కాఫీ చప్పరిస్తూ తల ఊపాను.

"వాళ్ళని నేను చూడనేలేదు. ఆమాటకొస్తే నీ కోడలినే చూడ

లేదు." బాధపడింది అక్కయ్య.

"ఎప్పుడో వీలు చూసుకొని వాళ్ళే వస్తారులే అక్కా" ఆ మాట ఆమెని ఓదార్చటానికే అని తెలిసికూడా అనక తప్పలేదు.

గబగబా అక్క లోపలికి వెళ్ళింది. ఇల్లంతా చూశాను. ఏ మార్పు లేదు మరమ్మతుకి నోచుకోని గోడలు అక్కడక్కడ బీటలు వేసి, సున్నం రాలుతూ కనిపించాయి. ఆ పాతగోడల మీద దేవుళ్ళ ఫోటోలు నాకూ, ఈ ఊరికీ ఉన్న సంబంధంలా ఊడిపోకా, నిలబడలేకా వేలాడుతున్నాయి.

"ఈ మామిడి పండు ముక్కలు తినరా, ఈరోజు చంద్రగ్రహణం కదా? పెందలాడె భోజనాలు చెయ్యాలని టిఫినేమీ చెయ్యలేదు." ఓ ప్లేటు నిండా మామిడి పండు ముక్కలు తీసుకొచ్చింది అక్కయ్య.

"బావ ఎక్కడా, కనబడరేం?"

"ఎల్లుండి నాన్నగారి ఆబ్దికం కదరా, పురోహితునికి గుర్తుచేసి వస్తానని చెప్పి వెళ్ళేరు, వచ్చేవేళయింది."

ఎల్లుండి నాన్నగారి ఆబ్దికమా? అసలు ఆబ్దికం పెట్టవలసిన వాడిని నేను. నాకే గుర్తులే దీవిషయం. అయినా, నే నేనాడు ఆబ్దికం పెట్టానని?

"అవునురా నువ్వు ఆబ్దికం పెడుతున్నావా?"

నేనేమీ అనలేదు.

"నువ్వు పెట్టవేమోనన్న అనుమానం మాకుందిలే. అందుకే మీ బావ పెడుతున్నారు."

ఏం చెప్పాలో నాకు తోచలేదు. మన ఆచార, సంప్రదాయాలు పూర్తిగా మరచిపోయానని చెప్పాలా? లేకపోతే ఢిల్లీ లాంటి నగరంలో ఆబ్దికం పెట్టడానికి కావలిసిన సదుపాయాలు ఉండవని అబద్ధం చెప్పాలా? మామిడిపండు ముక్కలు నములుతూ కూర్చున్నాను.

"ఇన్నాళ్ళూ ఉద్యోగ బాధ్యతల వల్ల కుదరకపోయి ఉండవచ్చు గానీ ఇప్పుడు రిటైర్ అయిపోయావు గదా? ఇకనైనా ఇలాంటివన్నీ చెయ్యొచ్చు కదా?"

ఇబ్బంది కలిగించే ఆ సంభాషణ ఆపడం ఎలా?

"మామిడిపళ్ళు బాగున్నా యక్కా, ఏ చెట్టువి."

"అదేరా పెరట్లోది. నువ్వు పుట్టినప్పుడు నాన్నగారు వేసిన చెట్టువి."

నేను పుట్టిన మరునాడే నాన్నగారు ఆ చెట్టు వేశారు. చాలా జాగ్రత్తగా నీరుపోసి పెంచారు. అరవైఐదు వసంతాలు చూసిన ఆ చెట్టు ఇప్పుడు ఎంతో ఎదిగిపోయి ఉండాలి.

పెరట్లో కెళ్లాను. కొబ్బరిచెట్లు, పనసచెట్లు, మామిడి చెట్లు అన్నీ బాగా కాశాయి, ఆ పెరట్లో ఒక్కొక్క చెట్టుకి, ఒక్కొక్క మొక్కకీ, నాకు ఎంతో అనుబంధం ఉంది. వాటన్నిటినీ నా చేతులతో నేను పెంచాను. నీళ్ళుపోసి, పాదులు చేసి, ఎరువులు వేసి పెంచాను. ప్రతి చెట్టు దగ్గరకు వెళ్ళి నించుంటే నా హృదయం వేగంగా కొట్టుకుంది. ఏదో అనిర్వచనీయమైన అనుభూతి మనసులోకి పాకింది. ప్రతి ఆకూ, ప్రతి మొక్కా, ప్రతి మట్టిరేణువూ "సుబ్బారావు వచ్చాడు, సుబ్బారావు వచ్చాడు." అని చెప్తున్నట్లు అనిపించింది.

నాకు బాధ అనిపించింది. ఈ అనుబంధాన్ని ఈ ఆప్యాయతని శాశ్వతంగా తెంచటానికి వచ్చేనన్నది గుర్తొచ్చింది. నాకూ, మా ఊరికీ ముడిపెట్టినటువంటి ఈ ఇల్లు, ఈ పొలం అమ్మి సొమ్ము చేసుకోవాలని వచ్చిన నేను, బలహీనుణ్ణవుతున్నానా?

బావగారు వచ్చేరు. గోదావరి వరదల గురించి, పెరిగిపోతున్న వ్యవసాయ కూలీ గురించి మాట్లాడుతున్నారు ఆయన. నాకేదీ బుర్రకెక్కడంలేదు. ఇల్లు, పొలం అమ్మాలి. అది బావతో చెప్పటం ఎలా?

"ఏమిటోయ్ సుబ్బారావ్, అదోలా ఉన్నావు, ఒంట్లో బాగోలేదా?"

"అబ్బే బాగానే ఉందండీ, ఇప్పుడూ మాగాణి రేట్లెల్లా ఉన్నయ్?"

"ఓ లక్షదాకా ఉంటుంది, ఏం, భూమి కొంటావా?"

"కొనలేను బావగారు. నా పొలం, ఇల్లు అమ్మదా మనుకొం-

టున్నాను."

షాక్ తిన్నట్లయ్యారు వాళ్ళిద్దరూ. ఓ నిముషం ఏమీ మాట్లాడలేదు.

"అదేం పాడు ఆలోచనరా?" ఓ నిముషం ఉండి తమాయించుకొని అంది అక్క "ఇప్పుడు ఈ పొలం, ఈ కొంపా అమ్మకోవలసిన కర్మ ఏం పట్టిందిరా?"

"రిటైర్ అయిపోయాను కదక్కా ఢిల్లీలో ఇల్లు కట్టుకుంటాను. అందుకు డబ్బుచాలకపోతేనూ..."

"ఇది అమ్మితే వచ్చే డబ్బు నీకో లెక్కా?"

నేనేమీ అనలేకపోయాను.

"చూడు సుబ్బారావూ, నీ ఇల్లు, నీ పొలం నీ ఇష్టం." అక్క శాంతంగా అంది. "మేమెలాగూ ఢిల్లీ వచ్చి నిన్ను చూడలేము. ఈ ఇల్లూ, పొలం ఉన్నంతకాలం ఎప్పుడో ఒకప్పుడు వాటి గురించయినా నువొస్తావని, అలాగైనా నిన్ను చూడవచ్చని ఈ ముసలితనంలో ఆశపడుతున్నాంరా." అక్క కంట్లోంచి నీటిచుక్కలు రాలాయి. "ఇకమీదట నిన్ను చూసే అదృష్టం కూడా మాకు లేదన్నమాట!" చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ లోపలి కెళ్ళిపోయింది అక్క.

నాకేం చెయ్యాలో అర్థంకాలేదు. ఇల్లూ, పొలమూ అమ్మితే అక్క బాధపడుతుంది. అమ్మకపోతే - తను వచ్చింది అది అమ్మటానికే.

ఉక్కిరిబిక్కిరి చేసే ఆ వాతావరణం లోంచి బయటపడితే బాగుంటుంది. ఓసారి అలా తిరిగివస్తే...

గేటు తీసి బయటకు వెళుతుంటే అక్క కేకేసింది. "ఒరేయ్ సుబ్బారావ్. త్వరగా ఇంటికి వచ్చెయ్. ఈ రోజు పూర్తి చంద్రగ్రహణం. త్వరగా భోజనాలు చేయాలి."

ఎండవేడి తగ్గిపోయింది. సూర్యుడు పదవీ విరమణ చేయటానికి సిద్ధమవుతున్నాడు. పగలంతా బ్రతుకుతెరువు కోసం ఎక్కడెక్కడో తిరిగిన ఆవులు, గేదెలు ఇళ్ళు చేరుకుంటున్నాయి.

రోడ్డుమీద ఎవ్వరూ కనిపించటం లేదు. అగ్రహారమంతా నిర్మా-

నుష్యంగా ఉంది. ఇళ్ళుతాళాలు వేసి ఉన్నాయ్. మంచి ఇల్లు ఒక్కటి లేదు. పెంకులు ఊడిపోయి, రంగులు వెలిసిపోయిన ఇళ్ళే ఎక్కువ.

రోడ్డునిండా రాళ్ళే. చిన్నప్పుడు ఈ రోడ్డుమీద కబడ్డీ ఆడే-వాళ్ళం. ఆ రోజుల్లో అగ్రహారం కళకళలాడుతూ ఉండేది. అప్పటి నా స్నేహితులు ఇప్పుడెక్కడున్నారో? బ్రతుకుతెరువు వెతుక్కుంటూ దేశదేశాలు వెళ్ళినవాళ్ళు అక్కడక్కడే స్థిరపడిపోయి నట్లున్నారు.

తిన్నగా నడిచి అగ్రహారం చివర ఉన్న గుడి దగ్గరకు వెళ్ళాను, అక్కడ ప్రశాంత వాతావరణమేమన్నా కాస్త మనశ్శాంతిని ఇస్తుం-దేమో అని.

దీపాల వేళ అయినప్పటికి గుడి తలుపులు ఇంకా తీయలేదు. బహుశా నిత్యపూజలు జరగడం లేదేమో? ఈ అగ్రహారంలో జనాలే లేనపుడు జనాల కోసం సృష్టించిన ఆ దేవుడెందుకు?

గుడిచుట్టూ ఓ ప్రదక్షిణం చేశాను. గుడి బాగా పాతబడిపోయింది. శిథిలమౌతున్న శిల్పాలు, పెచ్చులూడిపోతున్న స్తంభాలు, పగుళ్ళు కని-పించే మండపాలు, క్షీణించుకుపోతున్న హైందవ సంస్కృతికి ప్రతీకగా నిలచిపోయాయి.

బాధవేసి వెనక్కి నడిచాను. ఇంటికెళ్ళాలి. చీకటి పడిపోతోంది. అక్కా బావగారు ఎదురుచూస్తూ ఉంటారు. ఎవరో పేరుపెట్టి పిలి-చినట్లయింది. వెనక్కి తిరిగేను.

"నేనే సుబ్బారావు, సుందరిని. గుర్తుపట్టలేదా?"

సుందరా? ఎంత మారిపోయింది!

"ఎన్నేళ్ళకి కనిపించావు? రా, కూర్చో."

అరుగుమీద కూర్చున్నాను.

సుందరీ, నేనూ చిన్నప్పుడు కలిసి చదువుకున్నాము. "నువ్వు రిటైర్ అయిపోయావుట కదా. అబ్బాయి పేపర్లో చూసానని చెప్పాడు." ఎదురుగా వచ్చి కూర్చుంటూ అడిగింది సుందరి. "ఇక మన ఊరు వచ్చేశావా?"

"లేదు సుందరీ. ఢిల్లీలోనే సెటిలవుదా మనుకుంటున్నాను."

"రిటైర్ అయిన తరువాత మనకి అక్కడేం పని? బ్రతుకుతెరువు కోసం వెళ్ళావు. ఆ పని అయిపోయింది. నీలాగా అందరూ సిటీల్లో సెటిల్ అయిపోదా మనుకుంటున్నారు, గనకే, సిటీల్లో సమస్యలు పెరిగిపోతున్నాయి. అక్కడ ఉద్యోగం చేసేవారికి ఎలాగూ తప్పదు."

"మరి ఇక్కడేముంది?"

"భలే అడిగావ్. ఇక్కడేముందనా? ఉండేదంతా ఇక్కడే. ఈ గ్రామాలే ఆ నగరాలని నిలబెట్టేవి. ఇది మనం పుట్టిన ఊరు ఆప్యాయంగా మనని పలకరించే వాళ్ళు ఉన్న ఊరు. మన అలవాట్లు, మన సాంప్రదాయాలు మన కిచ్చిన ఊరు."

నిజమే అయినా సిటీలో ఉండే సదుపాయాలు, సుఖ సౌకర్యాలు...

"నీకు తెలీదులే సుందరీ. సిటీ వాతావరణం, సదుపాయాలు వేరు. ఇక్కడేమున్నాయ్. ఓ మంచి రోడ్డు ఉందా? బస్సు ఉందా? ఓ డాక్టరా, ఓ హాస్పిటలా?"

"నీలాంటి వారంతా సిటీకి పరుగెడుతుంటే ఇక్కడేముంటుంది? పెద్ద ఉద్యోగం చేసి రిటైర్ అయిన నీకు మంచి పలుకుబడి ఉంది. నీలాంటి వాళ్ళు ఓ పదిమంది ఇక్కడ సెటిలై మీ పలుకుబడిని ఉప-యోగిస్తే మన ఊరు బాగుపడుతుంది. అక్కడ సిటీలో రద్దీ తగ్గుతుంది."

ఏమనాలో నాకు తోచలేదు సుందరి మాటల్లో నిజం ఉన్నట్లుంది.

"చిన్నప్పుడు పల్లె జీవితం గురించి లెక్చర్లు దంచేవాడివిగా - మరి-ప్పుడు?" సుందరి ఇంట్లోకి వెళుతూ, అంది "ఉండు సుబ్బారావ్. దీపం వెలిగించి వస్తాను."

నిజమే, చదువుకునే రోజుల్లో అలాగే వాదించేవాణ్ణి. పదో తర-గతిలో ఉండగా ఒకసారి "పల్లె జీవి<sup></sup>ము, పట్నవాసమూ" అనే విషయం మీద డిబేట్ పెట్టేరు. పట్నవాసమే మంచిదని సుందరి శ్రోతల్ని ఆకట్టుకున్నట్లు మాట్లాడింది. చిన్నప్పటి నుంచి సుందరి అంతే, ఏ విషయం గురించయినా కచ్చితంగా, వినేవాడిని ఆకట్టుకు-న్నట్లు మాట్లాడి శ్రోతల మెప్పు పొందేది. డిబేట్లలోనూ, ఎలక్యూషన్ పోటీల్లోనూ ప్రైజులన్నీ సుందరికే వచ్చేవి. కానీ ఆసారి మాత్రం

పల్లె జీవితం గురించి నేను బాగా మాట్లాడానట. ప్రైజు నాకే వచ్చింది. ప్రైజు పుచ్చుకొని వస్తుంటే స్టేజి వెనకాల నిలబడి మూతి ముడుచుకొని అందికూడా "లెక్చర్లు దంచటం కాదులే జీవితంలో ఏం చేస్తావో చూస్తాగా?" అని. అది గుర్తుంచుకొని ఇప్పుడు దెప్పుతోందన్న మాట.

"నువ్వు మాత్రం ఏం చేశావు? పట్నవాసమే మేలని చెప్పి ఈ పల్లెలో స్థిరపడిపోలా?" బుడ్డి దీపం పుచ్చుకొని వచ్చిన సుందరిని అడిగేను.

"నేనిక్కడ స్థిరపడిపోయిన మాట నిజమేగాని నేను బొంబేలో ఉన్నాను, ఢిల్లీలో ఉన్నాను, బోస్టన్‌లో కూడా ఉన్నాను. పెరిగిపో-తున్న జనాభాతో ఒరిగిపోతున్న నగరాలు, అక్కడ సదుపాయాలు కూలిపోకుండా ఉండాలంటే మనలాంటి అన్ ప్రొడక్టివ్ పీపుల్ అక్కడ ఉండకూడదని తెలుసుకున్నాను. మన ఊరికి చేతనైన సేవలు చేస్తూ ఒంటరిగా ఉంటున్నాను."

సుందరి వెలిగించిన దీపం చీకటిని తొలగించలేకపోతోంది. మళ్ళీ వస్తానని చెప్పి ఇంటికి బయలుదేరాను.

భోజనం వడ్డించిన తరువాత కూడ అక్క ఏమీ మాట్లాడలేదు. వాతావరణం బాగా బరువుగా ఉంది.

అరుగుమీద మడతమంచం వేసింది. అలసిపోయిన నేను పడుకు-న్నాను.

గ్రహణం మొదలైనట్లుంది. వెన్నెల వెలుగు మెలమెల్లగా తగ్గిపో-యింది. ఆకాశం నిండా నల్లని మబ్బులు.

నాకు నిద్ర పట్టలేదు. ఓ రకంగా ఆలోచిస్తే సుందరి చెప్పింది నిజమే అని తోచింది. రిటైర్ అయిన వారు వారి ఊళ్ళకి వెళ్ళి-పోతే నగరాల్లో జనసమ్మర్దం కొద్దిగా తగ్గుతుంది కదా? అందువల్ల నగరాల్లో బ్రతికేవారికి కూడా కొంత రిలీఫ్ ఉంటుంది కదా?

కానీ ఈ పల్లెటూళ్లో బ్రతకటం ఎలా? ఎందుకు బ్రతకలేము? నా వలుకుబడి ఉపయోగించి ఈ పల్లెటూరిని అన్ని సదుపాయాలూ ఉన్న ఓ చిన్న పట్నంగా మార్చలేనా?

ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. కళ్ళు తెరిచేసరికి గ్రహణ విముక్తుడైన చందమామ మిలమిలా మెరుస్తున్నాడు.

అక్క లేచి ఏవో స్తోత్రాలు పాడుకుంటూ పనులు చేసుకుంటోంది.

నే నో నిర్ణయానికి వచ్చాను. నాకు ఈ ఊరు, ఈ నేలా, ఈ గాలి కావాలి. మా నాన్న, మా తాత కలిసిపోయిన ఈ మట్టిలోనే నేనూ కలవాలి.

"అక్కా?" లేచి కూర్చుని పిలిచేను. "ఈ ఇల్లూ, ఈ పొలం నేను అమ్మదలచుకో లేదక్కా."

"నిజమేనట్రా?" ఆమె గొంతులో ఆశ్చర్యం.

అక్క కళ్ళలో ఎంతో ఆనందం, వెలుగు కనిపించాయి. ఆ వెలుగే సూర్య కిరణాలుగా ప్రపంచమంతటా వ్యాపించింది.

(ఆంధ్రప్రభ వారపత్రిక 3-5-89 సంచికలో ప్రచురితం)

* * *